క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పర్వత చిట్టిబాబు సేవలు మరువలేం



శంఖవరంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు తదితరులు

శంఖవరం: మాజీ ఎమ్మెల్యే పర్వత చిట్టిబాబు ప్రత్తిపాడు నియోజకవర్గానికి చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. శంఖవరంలో గురువారం మాజీ ఎమ్మెల్యే చిట్టిబాబు జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత చిట్టిబాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి చిట్టిబాబు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేవారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పర్వత బాపనమ్మ, పర్వత సీతారత్నం, పర్వత జానకీదేవి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు పలు పార్టీల నాయకులు అండగా నిలిచారు. వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, వాగు బలరామ్ తదితరులు తహసీల్దార్ చిన్నారావుతో కలిసి దగ్ధమైన ఇళ్లను పరిశీలించారు. బాధితులకు నగదు, బియ్యం అందజేశారు. బాధితులకు ప్రభుత్వం ద్వారా అందించాల్సిన నష్ట పరిహారంపై చర్చించారు. టీడీపీ నాయకులు బాధితులకు సాయం అందజేశారు. కార్యక్రమంలో బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగండి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



రామవరంలో వైఎస్సార్ పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

జగ్గంపేట: మండలంలోని రామవరంలో రైతులకు ఖరీఫ్ సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ గురువారం అవగాహన కల్పించారు. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు మిత్ర పురుగులు, శత్రు పురుగులను గుర్తించడం, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. 25 శాతం ఆకుల కత్తిరింపు, 50 శాతం ఆకుల కత్తిరింపు, 15 శాతం పిలకల తొలగింపు, 30 శాతం పిలకల తొలగింపు తదితర అంశాలపై ప్రయోగాత్మకంగా వివించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



చిల్లంగిలో దొంగబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం పంచాయతీ చిల్లంగి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల దొంగబాబు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. కాగా గురువారం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, జెడ్పీ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దొంగబాబు మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

వలంటీర్లకు అండగా ఉంటాం

గండేపల్లి: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న వలంటీర్లకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన వలంటీర్ కుండల సుబ్రహ్మణ్యం ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశాంత్రి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చంటిబాబు గురువారం నీలాద్రిరావుపేటలో సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, సర్పంచ్ ములంపాక సురేష్, గ్రామస్తులు ఉన్నారు.

మెట్టలో ఖరీఫ్ ఆలస్యం

- మూడు మండలాల్లో కావరాని వర్షాలు
- మందగించిన వరినాట్లు
- ఎండుతున్న వరినారు మడులు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



ఎస్.అన్నవరం పరిధిలో ఎండిపోతున్న ఖరీఫ్ నారుమడులు



చామవరంలో చుక్కనీరు లేకుండా ఎండిపోయిన పల్లివాని చెరువు

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన తుని సబ్ డివిజన్‌లో ఖరీఫ్ వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా వరినాట్లు ముమ్మరం కాలేదు. వర్షాలు కురవకపోవడం, వివిధ ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో సాగు నీరు చేరకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సాగు నీటి ఎద్దడితో నారుమడులు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

15,645 హెక్టార్లలో వరిసాగు

వ్యవసాయ శాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో 15,645 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇందుకు గాను రైతులు 645 హెక్టార్లలో నారు వేశారు. వాతావరణం అనుకూలిస్తే 80 శాతానికిపైగా వరినాట్లు పూర్తయ్యేవి. వెదజల్లు, డ్రమ్ సీడర్, నాట్లు పద్ధతుల్లో ఐదు మండలాల్లో ఇప్పటి వరకు కేవలం 2,487 హెక్టార్లలో (16 శాతం) మాత్రమే నాట్లు వేశారు. కోటనందూరు, తొండంగి మండలాల్లో సాధారణ, తుని, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఐదు మండలాల్లో మొత్తంగా 1936.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావలసి ఉండగా 1387.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు.

సాగునీటి వసతులు ఇలా

పంపా, తాండవ రిజర్వాయర్లు, పుష్కర కాలువ ద్వారా సాగునీరు విడుదలైనప్పటికీ సాధారణ వర్షాలు కురిస్తేనే మెట్ట ప్రాంతమైన తుని సబ్‌డివిజన్‌లో నాట్లు పూర్తవుతాయి. ఇప్పటికే పంపా, తాండవ, పుష్కర జలాలు విడుదల చేస్తున్నా సాగునీటి అవసరాలు తీరడం లేదు. దీనికి తోడు వర్షాలు కురవడం లేదు. ఫలితంగా నాట్లు వేయడం ఆలస్యమవుతోంది. నీటి నిల్వలు లేకపోవడంతో సాగునీటి చెరువులు వెలవెలబోతున్నాయి. తుని మండలంలోనే 75 సాగునీటి చెరువులు ఉండగా 60కిపైగా చెరువుల్లో నీరుకానరాలేదు. తుని మండలం గవరపేట, టి.వెంకటాపురం, టి.తిమ్మాపురం, హెచ్.కొత్తూరు, హంసవరం, వల్లూరు, అగ్రహారం, ఎస్.అన్నవరం, చామవరం, తొండంగి మండలం పైడికొండ, ఆనూరు, తదితర గ్రామాల పరిధిలో చెరువులకు పుష్కర జలాలు చేరాల్సి ఉంది.

తుని సబ్‌డివిజన్‌లో వరి నాట్ల వివరాలు

మండలం	వరిసాగు (హెక్టార్లలో)	నారు మడులు (హెక్టార్లలో)	వేసిన నాట్లు (హెక్టార్లలో)
కోటనందూరు	3875	121	466
తుని	2671	98	101
రౌతులపూడి	2134	163	173
శంఖవరం	1459	58	514
తొండంగి	5506	25	1233
మొత్తం	15,645	465	2,487

మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

మండలం	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం	వర్షపాతంలో వ్యత్యాసం
కోటనందూరు	280.8	246.1	– 34.7
తుని	407.2	291.2	– 116
రౌతులపూడి	422.8	277.9	– 144.9
శంఖశరం	422.8	188.6	– 234.2
తొండంగి	402.5	383.4	– 19.1

నారుమడి ఎండిపోతోంది

మాకు ఎస్.అన్నవరం కోమటి చెరువు ఎగువన రెండెకరాల భూమి ఉంది. నాట్లు వేసేందుకు అవసరమైన నారు పెంచేందుకు పది సెంట్లలో వరి విత్తనాలు వేశాను. కొద్దిరోజులుగా వర్షాలు కురవలేదు. పొలం పక్కనే ఉన్న పుష్కర కాలువకు సాగునీరు చేరడం లేదు. సాగునీటి ఎద్దడితో నారుమడి ఎండిపోయింది. వర్షాలు పడినా, పుష్కర జలాలు వచ్చినా ప్రత్యామ్నాయంగా నారు కొనుగోలు చేసి నాట్లు వేయాలి.

– డి.సన్యాసిరావు, రైతు, కొత్తూరు

అదును పదును చూసి నాట్లు వేయండి

పంట పూర్తికాలానికి సాగునీరు వసతులు ఉన్నా రైతులే ఖరీఫ్ నాట్లు వేసుకోవాలి. నీటి వసతుల్లేని ప్రాంతాల్లో రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు, వెదజల్లు పద్ధతుల్లో సాగు చేపట్టాలి. వర్షాధారంపై సాగు చేసే రైతులు అదును పదును చూసుకుని సాగు చేయాలి. తడులిస్తూ నారుమడులను కాపాడుకోవాలి. నారు ముదిరితే చిగుర్లు కత్తిరించి నాట్లు వేసుకోవాలి. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రౌతులపూడి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. రౌతులపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కోటనందూరు: ప్రజలకు మెరుగైన సేవలందించాలని సచివాలయ సిబ్బందికి ఈఓపీఆర్డీ జి. అరుణ్‌కుమార్ సూచించారు. మండలంలోని అల్లిపూడి-1, 2 గ్రామ సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయ పరిసరాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయానికి వచ్చిన గ్రామస్తులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు పంచాయతీ కార్యదర్శి ఏవీ రమణ పాల్గొన్నారు.

నేడు తిరుమలాయపాలెంలో గడప గడపకూ...

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యోగులకు సేవలే గుర్తింపు



గండేపల్లిలో ఎంపీడీఓ రామన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సత్కారం

గండేపల్లి: ఉద్యోగులకు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపును ఇస్తాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్కొన్నారు. గండేపల్లి ఎంపీడీఓ బీకేఎస్ఎస్‌వీ రామన్ స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవా పురస్కారం పొందారు. ఈ సందర్భంగా గురువారం ఎంపీడీఓ రామన్‌ను ఎమ్మెల్యే పూలమాల, శాలువాతో సత్కరించారు. ఎంపీడీఓ రామన్‌ను ఇతర ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, సర్పంచ్ ములంపాక సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ భావతేజకు సన్మానం

ఏలేశ్వరం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గుర్తింపే అవార్డులని మండల పెన్షనర్స్ సంఘ గౌరవాధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు అన్నారు. స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న ఆర్థోపెడిక్ వైద్యుడు భావతేజ ఉత్తమ సేవా అవార్డు పొందారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం భావతేజను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఆర్థోపెడిక్‌గా ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కటకం కిరిటీ, అడపా దుర్గారావు, సిరిపుడ్స్ కృష్ణ, దాకమర్రి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వైద్యుడు భావతేజను సన్మానిస్తున్న నాయకులు



గోకవరం ప్రభుత్వాస్పత్రిలో హెడ్‌నర్స్ లీలను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

హెడ్‌నర్స్ లీల సేవలు అభినందనీయం

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో హెడ్ నర్స్‌గా పని చేస్తున్న లీల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఆమెను గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ వనజాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు తోలేటి రాంప్రసాద్, మందపాటి సతీష్, వైద్యులు ఝాన్సీ, చైతన్య, రామలక్ష్మి, భార్గవి, సందీప్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- నీలాద్రిరావుపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం



నీలాద్రిరావుపేటలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, సర్పంచ్ ములంపాక సురేష్ తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గండేపల్లి ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, బొర్రంపాలెం సర్పంచ్ పోకల సుబ్బు, తహసీల్దార్ వీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ రామన్, ఏపీఓ గంగాభవాని పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అనువైన చోటే ఇళ్ల స్థలాలు

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



నీలాద్రిరావుపేటలో స్థలం చదును పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: నవరత్నాలు–అర్హులందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు అనువైన చోటే ఇళ్ల స్థలాలు ఇస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో లబ్ధిదారులకు ఇచ్చేందుకు సేకరించిన ఇళ్ల స్థలాల్లో తుప్పల తొలగింపు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. గతంలో ఇచ్చిన స్థలాలు ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేవని లబ్ధిదారులు తెలపడంతో వారి కోరిక మేరకు అనువైన స్థలాన్ని సేకరించామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ చలగళ్ల దొరబాబు, సర్పంచ్ ములంపాక సురేష్, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ తదితరులు ఉన్నారు.

నేడు శ్రీప్రకాష్‌లో వ్యవస్థాపక వేడుకలు

తుని: స్థానిక శ్రీప్రకాష్‌లో వ్యవస్థాపక వేడుకలను శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నట్టు ఆ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గాతా రహే మేరా దిల్, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శనివారం సాయంత్రం జరిగే ముగింపు వేడుకలకు హంగేరికి చెందిన ప్రముఖ పకావజ్ విద్వాంసులు బలాజ్స్ విరాగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అంతర్జాతీయ యోగా గురువు పి.దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తామని తెలిపారు.

పథకాల అమలులో 'ప్రత్తిపాడు' ముందంజ

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- నియోజకవర్గ స్థాయి జేసీఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు: ప్రభుత్వ పథకాలతో పాటు పార్టీ కార్యక్రమాల అమలులో ప్రత్తిపాడు నియోజకవర్గం రాష్ట్రంలో టాప్ టెన్‌లో ఉందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. దీనికి కారణమైన వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్తిపాడు సరయూ ఫంక్షన్ హాలులో గురువారం నియోజకవర్గ స్థాయి జేసీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ జేసీఎస్ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు సభ్యత్వ నమోదు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలోని 92,236 గృహాలుండగా 78 వేల గృహాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఓటరు సర్వేపై సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు దృష్టి సారించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువకులను ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే రానున్న ఎన్నికల్లో కీలకపాత్ర పోషించి తిరిగి వైఎస్సార్ సీపీని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకుడు కుడుపూడి భరత్, ఎంపీపీలు గోళ్ల కాంతి సుధాకర్, పర్వత రాజబాబు, జెడ్పీటీసీలు నీరుకొండ రాజకుమారి, గొల్లు దివాణం, దృశ్యకళా అకాడమీ చైర్‌పర్సన్ కుడిపూడి సత్య శైలజ, ఏలేశ్వరం కౌన్సిలర్ అలమండ చలమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు జిగిరెడ్డి రమణమ్మ, శేరు కృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్టీ, బీసీ సెల్ అధ్యక్షులు చింతల రాజు, ఈగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక అతిథిగృహానికి రంగులు



వినాయక అతిథిగృహం లోపల గోడలకు వేసిన రంగులు

అన్నవరం: స్టేట్ బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖర రాకతో రత్నగిరిపై సత్యదేవుని దేవస్థానంలో వినాయక అతిథిగృహం కొత్త కళను సంతరించుకుంది. ఈ అతిథి గృహానికి రంగులు, హంగులు సమకూరాయి. దేవస్థానమే ఇవన్నీ చేసిందని అనుకుంటే పొరపాటే. స్టేట్‌బ్యాంక్ అధికారులే తమ సొంత ఖర్చులతో ఈ పనులు చేయించారు. సాధారణంగా దేవస్థానంలో భవనాలకు రెండేళ్లకు ఒక సారి రంగులు వేయిస్తారు. అది కూడా టెండర్లు పిలిచి లోయెస్ట్ టెండర్ ఖరారు చేసి వేయిస్తారు. కాగా స్టేట్‌బ్యాంక్ చైర్మన్ పర్యటన ఖరారవ్వడంతో స్టేట్ బ్యాంకు అధికారులు అతిథిగృహం బయట, లోపల గదుల్లో రంగులు వేయించడంతో పాటు గోడలకు అందమైన వాల్‌పేపర్లు అతికించారు. అతిథి గృహంలో కొత్త ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. డైనింగ్ హాలును అందంగా తీర్చి దిద్దారు. దినేష్ ఖరకు అల్పాహారంలో 20 రకాల టిఫిన్లు, పది రకాల పండ్లు, పది రకాల జ్యూస్‌లు, ఐస్‌క్రీంలు, డ్రింక్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వినాయక అతిథిగృహం రంగులతో సుందరంగా కనువిందు చేస్తోంది.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

కిర్లంపూడి: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కిర్లంపూడి ఎస్సై బి. ఉమామహేశ్వరరావు కోరారు. మండలంలోని గెద్దానాపల్లిలో గురువారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామ ప్రజలు రాగద్వేషాలకు పోకుండా స్నేహ భావంతో మెలగాలన్నారు. గ్రామాల్లో నిషేధిత గంజాయి, సారా, మాదకద్రవ్యాల విక్రయాలకు ఎవరైనా పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన ఎస్‌బీఐ చైర్మన్



సత్యదేవుని వ్రతమాచరిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ ఖర దంపతులు

అన్నవరం: స్టేట్‌బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖర దంపతులు గురువారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వామివారి వ్రతకథను హిందీలో వ్రతపురోహితులు చలపతి, రాజ్యం రామయ్య వివరించారు. సాధారణంగా సత్యదేవుని వ్రతాన్ని తెలుగులోనే నిర్వహిస్తారు. తెలుగు భాష రాని వారి కోసం దేవస్థానంలో హిందీ, ఒడియాలో వ్రతకథ చెప్పే పురోహితులు ఉన్నారు. స్వామివారి దర్శనం అనంతరం దినేష్ ఖర దంపతులకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ పట్టువస్త్రాలు, సత్యదేవుని ఫొటో, ప్రసాదాలను బహూకరించారు. సత్యదేవుని భక్తుల కోసం రూ.30 లక్షలు విలువ చేసే 32 సీటెడ్ బస్సును దేవస్థానానికి స్టేట్‌బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖర అందజేశారు. వారి వెంట ఎస్‌బీఐ సీజీఎం ఎస్. నవీన్ కుమార్, డీజీఎం ఎస్.ప్రమోద్ కుమార్, ఆర్ఎం సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌కు సత్కారం

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీని దేశంలోనే అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దిన ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్ అత్యుత్తమ పారిశ్రామిక వేత్తలు అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ దినేష్ ఖర ప్రశంసించారు. గురువారం అన్నవరం దేవస్థానానికి వచ్చిన ఎస్‌బీఐ చైర్మన్‌ను మట్టే సోదరులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ వారిని బ్యాంక్ తరఫున అభినందిస్తూ షీల్డ్‌ను బహూకరించారు. శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మట్టే ఆదిశంకర్, మట్టే ఆదిత్య కృష్ణన్ పాల్గొన్నారు.



ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ ఖరకు రూ.50 కోట్ల చెక్కు అందజేస్తున్న శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేతలు

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.50 కోట్ల పెట్టుబడి

స్టేట్‌బ్యాంక్ మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.50 కోట్లను మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్ పెట్టుబడి పెట్టారు. ఈ మేరకు గురువారం చెక్కును బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖరకు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర ఝా, డీజీఎం ఎస్.ప్రమోద్ కుమార్, ఆర్ఎం సురేష్ బాబు, స్థానిక బ్రాంచ్ బీఎం రఘురామ్ పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

తొండంగి: కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలకు గురువారం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. వారం రోజులుగా వేసవిని తలపించేలా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. గురువారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై మండల వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో వర్షాలు కురుస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.